ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
5
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024

నగరంలో ట్రాఫిక్ తిప్పలు

- తెలంగాణ చౌక్‌లో పెరిగిన రద్దీ
- రోడ్డు దాటేందుకు పాదచారులు, వృద్ధుల ఇక్కట్లు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16: కరీంనగర్‌లో పలుచోట్ల నిత్యం వాహనాల రద్దీ కనిపిస్తోంది. తెలంగాణ చౌక్‌లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం, ముగిసే సమయం ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతున్నది. తెలంగాణ చౌక్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థలేకపోవటంతో నాలుగువైపుల నుంచి వాహనాలు ఒకేసారి వెళుతుండటంతో రద్దీ విపరీతంగా ఉంటోంది. దీనికి తోడు గీతాభవన్‌హోటల్, ఇతర హోటళ్లు, షాపులకు వచ్చే కస్టమర్లు తెలంగాణ చౌక్‌లోనే రోడ్డుపై వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తుతున్నది. హోటల్ ముందు ఎలాంటి పార్కింగ్ స్థలం లేకపోయినప్పటికీ వాహనాలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు రాజకీయ పార్టీలు, సంఘాలు, ఎన్‌జీఓ సంస్థలు, నిరసనకారులు ఏ కార్యక్రమం చేపట్టాలన్నా తెలంగాణ చౌక్ ఒక అడ్డాగా మారింది. నిరసన, దిష్టిబొమ్మ దహనాలు, జన్మదిన వేడుకలు, రోడ్‌షోలు వంటివి ఇక్కడే చేపట్టడంతో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు జనాలతో సందడిగా ఉంటుంది. తెలంగాణ చౌక్‌లో నాలుగు మార్గాలలో వాహనాల రాకపోకలు ఉండటంతో పాదచారులు రోడ్డుదాటాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉందని వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. మరో వైపున తెలంగాణ చౌక్ నుంచి సెవెన్‌హిల్స్ మార్గంలో దుకాణాల ఎదుట రోడ్లపైనే వాహనాలు నిలపటం, మరో పక్కన పూలేమైదానం ప్రహరీ వైపు బారులు తీరి వాహనాలు పార్క్ చేయ టంతో ఈ రోడ్డు వెంట వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈ మార్గంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక మలబార్ జ్యువెల్లరీ షాపునకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే యథేచ్ఛగా పార్క్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఒక వైపున బారీకేడ్లు ఏర్పాటు చేసి రోడ్డును మూసివేస్తున్నారు. ఇది ఆ షాపుకు అనుకూలంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ చౌక్‌లో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ రోడ్లపై అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్న వాహన దారులపట్ల ఉదాసీనత వైఖరిని అవలంభిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టి, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని నగరప్రజలు కోరుతున్నారు. పోలీస్‌కమిషనర్ ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి తెలంగాణచౌక్‌లో నెలకొన్న ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



తెలంగాణ చౌక్ వద్ద వాహనాలు


వాహనాల రద్దీతో పాదచారుల ఇబ్బందులు

'పోషణ ఆరోగ్య జాతర'ను విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో త్వరలో నిర్వహించనున్న పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూనిసెఫ్ ప్రతినిధులతో కలిసి పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, మెప్మా,ఐకేపీ శాఖల అధికారులు సమన్వయంతో పోషణ ఆరోగ్య జాతరను విజయవంతం చేయాలని సూచించారు. పోషకాహారం, ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై కళాజాత, నాటిక వంటి కార్యక్ర మాలతో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈసమావేశంలో జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వ తి, యూనిసెఫ్ అధికారులు డాక్టర్ క్యాతి తివారీ, బీవి సుబ్బారెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సునిత, డిఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, పంచాయతీరాజ్ ఏవో ఫరీదుద్దీన్, ఎంపీడీవో, ఎంపీవో, సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

సుభాష్‌నగర్, ఆగస్టు 16: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జికర్ మెడికల్ కళాశాల ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా ఈ నెల 17న దేశవ్యాప్తంగా ఉదయం 6 గంటల నుంచి 18 ఉదయం వరకు 24గంటలపాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ పోలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా వైద్య సేవలు నిలిపివేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చిన్నట్లు తెలిపారు. 18న 6 గంటల తరువాత వైద్యసేవలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. అత్యవసర సేవలు మినహా అన్ని సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా తలపెట్టిన 24 గంటల వైద్య సేవల నిలిపివేతకు మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ తమ సంపూర్ణ మద్దతు తెలిపింది.

ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

భగత్‌నగర్, ఆగస్టు 16: ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ కౌన్సిల్ సమావేశం రామారపు వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. యూనివర్సిటీల్లో వీసీల నియామకాన్ని వెంటనే చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకుల విద్యార్థుల మరణాలు బాధాకరమని, సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, కార్యదర్శి మచ్చరమేష్, మామిడిపల్లి హేమంత్, కనకం సాగర్, కేశబోయిన రాము, చట్ల సమ్మయ్య, లద్దునూరి విష్ణు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సందీప్‌రెడ్డి, పొన్నం శ్రీకాంత్, అనుదీప్,నాగ ఆదిత్య, సంతోష్ తదితరులు పాల్గన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

- ఆలయాల్లో మహిళల పూజలు



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 16: గృహాలకు మామిడి, పూల తోరణాలు.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు.. వ్రతాలు.. వాయినాల మధ్య సౌభాగ్యదాయిని వరలక్ష్మీతల్లీ.. రావమ్మా.. మహాలక్ష్మీ రావమ్మా.. అంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరలక్ష్మీ శుక్రవార వేడుకను జరుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు, అమ్మవారి నామస్మరణలు, దీపకాం తులతో ప్రతిగృహం కళకళలాడింది. ముత్తైదువలు, యువతులను ఆహ్వానించి పసుపు కుంకుమలు, పప్పు బెల్లాలు, ఫల తాంబూలాలు, వస్త్రాలు, వాయినాలుగా ఇచ్చారు. ఆలయాల్లో అర్చనలు జరిపి ఒడి బియ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చైతన్యపురి మహాశక్తి దేవాలయం మహిళలతో పోటెత్తింది. యజ్ఞవరాహస్వామి క్షేత్రంలోని మహాలక్ష్మీ ఆలయంలో అభిషేకం, వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో మహిళలు బారులు తీరి అమ్మవారికి ఒడిబియ్యం, గాజులు, పసుపుకుంకుమలు, చీరలు సమర్పించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, మేయర్ సతీమణి అపర్ణాసునీల్‌రావు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈటలు నాగారపు శ్రీనివాస్, నాగుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు, పర్వతవర్ధినీ అమ్మవారికి విశేషాలంకారం చేశారు. పాతబజార్ గౌరీశంకరాలయంలో రాజరాజేశ్వరీ మాతకు విశేషాలంకారం చేశారు.




మహాశక్తి ఆలయ ప్రాంగణంలో వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

రుణమాఫీ అంకెల గారడీ

- రైతు భరోసానే మాఫీగా చూపిన సీఎం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సుభాష్‌నగర్, ఆగస్టు 16: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి రుణమాఫీ చేయకుండా అంకెల గారడీ చేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని శ్రీపురం కాలనీలోగల తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర రుణమాఫీ చేసి రైతులను మోసం చేసిందన్నారు. కేవలం ఓట్ల కోసమే అబద్ధాలు చెప్పారని అన్నారు. అబద్ధాలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ అవే అబద్ధాలతో పాలన సాగిస్తుందని అన్నారు. నమ్మిన రైతాంగాన్ని కాంగ్రెస్ అత్యంత ఘోరంగా మోసం చేసిందన్నారు. ఒకే వేదికపై రుణమాఫీ గురించి మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని అన్నారు. రుణమాఫీ కోసం ఆరువేల కోట్లు విడుదల చేశామని, మంత్రి భట్టి విక్రమార్క, రూ.31 వేల కోట్లని తుమ్మల నాగేశ్వర్‌రావు అంటున్నారని చెప్పారు. రెండు లక్షల రుణమాఫీ గెలిచిన వెంటనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోట మాటలు ప్రజలందరూ విన్నారని అన్నారు. 2018లో తమ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ కోసం రూ.36.68కోట్లు విడుదల చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ రెండు లక్షల రుణమాఫీ కోసం మూడు విడుతల్లో సుమారు రూ.23.75 లక్షల మంది రైతులకు మాత్రమే ఇచ్చి, దాదాపు 46.25 లక్షల రైతులు రుణమాఫీకి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కన్నా ప్రస్తుతం 13 లక్షల మంది అర్హులు తగ్గిపోయారని అన్నారు. రైతుల సంఖ్యను వివిధ కారణాలు చూపి తగ్గించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. 2014లో కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలనను మాఫీ చేయడానికి రూ. 16,144 కోట్లు వెచ్చించి సుమారు 35లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చారని తెలిపారు. 2018లో లక్షలోపు రుణమాఫీ కోసం రూ.19,198 కోట్ల అంచనా కాగా రైతుల సంఖ్య 37లక్షలని అన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ చేసిన లక్ష రుణమాఫీతో పోల్చితే కాంగ్రెస్ రెండు లక్షల రుణమాఫీ ఖర్చు చేసింది చాలా తక్కువ అని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలు కోతలు పెట్టి లక్షల మంది రైతులను అనర్హులుగా తేల్చి వారి కడుపుకొట్టిందన్నారు. మూడో విడతలోనైనా తమకు న్యాయం జరుగుతుందేమోనని రైతులు ఆశపడ్డారని అన్నారు. కానీ మూడో విడతలో కేవలం 6లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. మొదటి విడతలో లక్ష వరకు రుణాలు ఉన్నవారిలో 11.34లక్షల మందికి మాత్రమే రూ.6వేల కోట్లు విడుదల చేసి రుణమాఫీ చేశారని తెలిపారు. అలాగే రెండవ విడతలో రూ. 1.5 లక్షల వరకు రుణం ఉన్నవారిలో 6.40లక్షల మందికి రూ. 6,190 కోట్లు విడుదల చేసి రుణమాఫీ చేశారని, మూడు విడతల్లో కలిపి రూ.23.75 లక్షల మందికి రూ.18,190 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. ముఖ్యమంత్రి రుణమాఫీకి పాస్‌బుక్ ప్రామాణికమైతే రేషన్‌కార్డు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. రైతుభరోసా ఉన్నట్లా లేనట్లా అని ప్రశ్నించారు. రైతు భరోసా నిధులనే రుణమాఫీకి మళ్లించారన్నారు. వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా ఎకరానికి రూ.7,500 ఇచ్చేదాక విడిచిపెట్టేది లేదని, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు ఇవ్వడంపై స్పష్టత ఇవ్వాల న్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని, లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని, ఏదో పర్టీలో విలీనం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యక్రమంలో పాల్గొన్న కొమటి రెడ్డి నరేందర్ రెడ్డి

మహిళలను అవమానపరుస్తున్న కేటీఆర్

- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

గణేష్‌నగర్, ఆగస్టు 16: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనను చూసి ఓర్వలేక కేటీఆర్ మహిళలపై అవమానకరంగా మాట్లాడుతున్నారని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చర్ల పద్మ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసి అధికారం కోల్పోగానే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి చర్ల పద్మ మాట్లాడుతూ మహిళలు పనిలేకుండా బస్సుల్లో తిరగరని ఎంతో బాధ్యతతో కుటుంబాన్ని నెట్టుకొస్తారన్నారు. కేటీఆర్ మహిళలను అవమాన పరుస్తున్నాడని వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాజొద్దీన్, ముక్క భాస్కర్, షబా నా, మహ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, రజితా రెడ్డి,మేరుకు స్వప్న, మాలోతు మహాలక్ష్మి, అష్టపురం తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మాతృ సంస్థకు మెప్మా పీడీ రవీందర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీందర్ తన మాతృసంస్థ ఉపాధి కల్పన శాఖకు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విధుల నుంచి విడుదల చేశారు. 2007 గ్రూప్ -1కు చెందిన రవీందర్ ఉమ్మడి జిల్లాలో పలు శాఖల్లో పనిచేశారు. నాలుగేళ్లుగా మెప్మా పీడీగా పనిచేస్తున్న ఆయనను ప్రాంతీయ ఉపాధికల్పనాధికారిగా మాతృశాఖకు బదిలీ చేశారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం



కరీంనగర్, ఆగస్టు 16: కరీంనగర్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. చిగురుమామిడి మండలంలో 171.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో 90మి.మీ, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 83.3 మి.మీ, వీణవంక మండలంలో 79.3, రామడుగు మండలం గుండిలో 79.3మి.మీ, గంగాధర మండలంలో 75.8 మి.మీ, చొప్పదండి మండలం వెదురుగట్టులో 68.8మి.మీ వర్షపాతం నమోదైంది.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 16: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వెల్డి గ్రామంలోని మానేరువాగు నుంచి కరీంనగర్‌కు ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని చంద్, రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి అదృశ్యం

జ్యోతినగర్, ఆగస్టు 16 : అన్నపూర్ణకాలనీకి చెందిన ధర్మల రామ్మోహన్ (45) అనే సింగరేణి కార్మికుడు అదృశ్యమయ్యాడు. కొన్ని రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన రామ్మోహన్ తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే కొత్తగూడెం వెళ్తున్నానని చెప్పినట్లు అతడి భార్య రాజకుమారి శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బుచ్చి నాయుడు తెలిపారు.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



ధాన్యం సంచులను బయటకు తెస్తున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 16: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణి రైస్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో గోదావరిఖని ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. సుమారు రెండు గంటల పాటు మంటలను అదుపులోకి తీసుకోచ్చే ప్రయత్నం చేశారు. ఎంత నష్టం వాటిల్లింది అనేది తేల లేదని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 16: జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పెగడపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం సాయంత్రం ఐదుగురు అనిమానిత వ్యక్తుల నుంచి 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన మల్యాల అజయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసిన జగిత్యాల పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై పెగడపల్లి నుంచి బతికపల్లి రోడ్డు మీదుగా వెళ్తుండగా డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్సై కిరణ్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఉన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం



పోలీసుల అదుపులో గంగరాజు

చందుర్తి, ఆగస్టు 16: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో అదృశ్యమైన ఎక్కలదేవి గంగరాజు అనే యువకుడి ఆచూకీ శుక్రవారం ఉదయం లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహ నంపై వివాదంలో ఉన్న భూమి వద్దకు వెళ్లి అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కాగా శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఒర్రె ప్రాంతంలో కొబ్బరి తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి ఉండి, అరుస్తున్న గంగరాజును గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన చేరుకుని గంగరాజును అదుపులోకి తీసు కొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపడుతు న్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంగరాజును ఎవరు, ఎందుకోసం పట్టుకెళ్లి తాళ్లతో బంధించి వదిలేశారు అనేది మిస్టరీ వీడాల్సి ఉంది. కాగా అదృశ్యమైన గంగరాజు ఆరుగురు వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసి ముసు గు కప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారని, తన నోట్లో టవల్ పెట్టడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి పడిపోయానని, శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో కాళ్లు, చేతులు బంధించి వదిలి వెళినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సిరిమల్లే లక్ష్మీనారాయణ(70)శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పవర్‌లూం కార్మికుడిగా పనిచేసే వాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య, పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందారు. చిన్నకుమారుడి వద్ద ఉంటున్న లక్ష్మీనారాయణ వయస్సు భారంతో పని చేయలేక పోతన్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు విధంగానే మదం తాగి అదే మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తన తండ్రి మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి (52) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దేవేందర్‌రెడ్డి వ్యవసాయం చేయడంతో పాటు గత 20 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. దీంతో పాటు మద్యం తాగుతుండే వాడు. ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటుండడంతో స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య నర్మద సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. అక్కడ నుంచే నిత్యం ఎల్లారెడ్డిపేటకు వస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటిలో ఒంటరిగా ఉంటున్న దేవేందర్‌రెడ్డి మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య నర్మద, కొడుకు, కూతురు, తల్లి ఉన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు రాజులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దేవేందర్‌రెడ్డి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య



భాను (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కొండ భాను (40) అనే ఆటో మొబైల్ స్టోర్ యజమాని అప్పుల బాధతో షాప్‌లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన పవర్‌లూం యజమాని కొండ నారా యణ కుమారుడు భాను కొత్తచెరువు కింద ఆటోనగర్‌లో శ్రీకమల్ ఆటోమొబైల్ స్టోర్‌ను పదేళ్ల క్రితం నెలకొల్పాడు. భానుకు ఆరేళ్ల క్రితం దీప్తితో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం భార్యకు చెప్పి ఇంటినుంచి షాప్‌కు వెళ్లాడు. షాప్‌కు వెళ్లి వచ్చేవరకు పిల్లలను అమ్మమ్మ ఇంట్లో దించివచ్చేందుకు రెడీ ఉంచమని చెప్పాడు. మధ్యాహ్నమైన భాను రాకపోవడంతో భార్య ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా దండెం కట్టిన నైలాన్ తాడు కనిపించలేదు.

దీంతో అనుమానం వచ్చిన భార్య వెంటనే ఆమె మరిదికి ఫోన్‌చేసి అన్న ఇంటికి వస్తానని చెప్పి వెళ్లి రాలేదని చెప్పింది. ఆమె మరిది మరో ఇద్దరు కలిసి ఆటోమొబైల్ స్టోర్‌కు వెళ్లి షటర్ పైకి లేపి చూశారు. భాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆటో మొబైల్ స్టోర్‌లో గత కొంతకాలంగా సక్రమంగా అమ్మకాలు లేవని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో తన భర్త భాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో డిష్ ఆపరేటర్..

కరీంనగర్ క్రైం: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన డిష్ ఆపరేటర్ గీకురు మిథున్ కుమార్(35) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలిపారు. మిథున్‌కుమార్ డిష్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిథున్‌కుమార్ ఆర్థిక బ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసగా మారాడు. మిథున్ భార్య, రెండు మూడు రోజుల కిందట తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న మిథున్‌కుమార్ శుక్రవారం ఉదయం 5:41 గంటలకు భార్యకు వాట్సాప్‌లో 'సారీ మళ్లీ జీవితం ఉంటే మా బంగారు తల్లుల (కూతుళ్ల) కడుపులో పుడుతా' అంటూ మెస్సేజ్ పెట్టాడు.

మెస్సేజ్‌ను చూసిని అతని భార్య మౌనిక వెంటనే పిల్లలతో కలిసి భగత్‌నగర్ ఇంటికి వచ్చి చూసేసరికి మిథున్‌కుమార్ గది తలుపులు బిగించుకుని ఉన్నాడు. స్థానికుల సహకారంతో బలవంతంగా తలుపులు తెరిచేసరికి ఉరికి వేళా డుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బం దులతో తాగుడకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మిథున్ కుమార్‌కు 7, 5 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 7,741 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో కేవలం ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరిగి అవకాశాలున్నాయి. దీంతో శనివారం మరో మోటారును ఆన్ చేసే సూచనలు కనబడుతున్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం శుక్రవారం కొనసాగింది. వానాకాలం పంటల సాగు కోసం ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 10,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,603 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంబేద్కర్ విద్యా నిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, ఆగస్టు 16: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, ఉప సంచా లకులు ఎం నగ్గెలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను విదేశీ విద్యాలయాల్లో విద్యను అభ్యసించే ఎస్సీ విద్యార్థులు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ రైతు శంకరపట్నం మండలంలోని కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం గ్రామానికి చెందిన సుంకరి సారయ్య (60) తనకున్న మూడెకరాల భూమిలో ఒక ఎకరం భూమి అదే గ్రామానికి చెందిన పెరుమండ్ల రాజబాబు అనే వ్యక్తికి అమ్మినట్లు తెలిపారు. అతడు ఒక ఎకరం భూమికి బదులుగా మూడెకరాల భూమిని పట్టా చేసుకున్నాడని పేర్కొన్నారు. దాంతో రైతు మనస్థాపం చెంది ఈ నెల 14న మొలంగూర్ నుంచి సైదాపూర్ వెళ్లే దారిలో అరటి తోట వద్ద కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యు లు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 15న అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుంకరి చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (32) అనే మహిళ జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. మహిళకు ఓ ఆర్ఎంపీ చికిత్స అందించగా వైద్యం వికటించి మృతి చెందిందని గ్రామస్థులు, మృతురాలి బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం.. స్వప్నకు జ్వరం రావడంతో రెండు మూడు రోజులుగా ఆర్ఎంపీ వైద్యం అందిస్తున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కొంత సమయం తర్వాత మృతిచెందినట్లు తెలిపారు. వైద్యం వికటించి స్వప్న మృతిచెందినట్లు గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు, సౌకర్యాలను తెలుసుకుంటున్న రవీందర్‌నాయక్

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

కొడిమ్యాల, ఆగస్టు 16: ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, ఫ్యామిలీ వెల్ ఫేర్ డా.. రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఆసుపత్రి గదులను, ఇన్‌పేషెంట్ రూంలను, ఫార్మాసిస్ట్ రూంను పరిశీలించారు. పలువురు పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయ్యేలా మహిళలకు అవగాహన కలిపించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా, మండల వైద్య అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సేవలను గురించి, అందిస్తున్న మందులను గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలుపాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స ఉచితంగా లభిస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న వైద్య అధికా రులు, సిబ్బంది పని తీరుపట్ల ఫలితం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి గదుల విస్తరణ, కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ కెటాయింపు గురించి డీఎంహెచ్‌వోకు సి ఫారస్ చేశారు. మండల కేంద్రానికి అంబులెన్స్ కెటాయించాలని, ఆ సుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయ కుడు బోగ రాకేష్ హెల్త్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియొద్దీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డా.. శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (ఎన్‌సీడీ) డా. అర్చన, డీపీవో (ఎన్‌హెచ్‌ఎం) డా. రవీందర్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'పోపా' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలు సత్యనారాయణ



నియామకపత్రాన్ని అందుకుంటున్న పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ (పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్‌కు చెందిన రిటైర్డు టీచర్, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన పోపా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరుగుతూ పద్మశాలి ఐక్యత కోసం కృషిచేయాలని అన్నారు. ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధిగా టీచర్లతో సత్సంబంధాలు కలిగి ఉన్నందున త్వరలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని సత్యనారాయణకు సూచించారు. రాజకీయ రంగంలో పద్మశాలీలు వెనుకబడి ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు పోటీచేసి ఘన విజయం సాధించాలని, ఇందుకోసం పద్మశాలి సంఘాలన్నీ ఐక్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, నాయకులు మంచికట్ల రమేశ్, గోలి వినోద్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పిస్కా లక్ష్మీనారాయణ, కొక్కుల గోవర్ధన్, ఆడెపు శ్రీనివాస్, దేవసాని సంపత్‌కుమార్, రుద్ర రమేశ్, దండె రాజశేఖర్, ఆదిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోతన కాలనీలో చోరీలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 16: గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతనకాలనీలోని సింగరేణి కార్మిక క్వార్టర్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని 31 బ్లాక్- 427 క్వార్టర్‌లో లాగల అనిల్ ఇంట్లో తాళం పగులగొట్టి రూ.5వేల నగదు, 32 బ్లాక్‌లో నివాసముం టున్న సురేష్ ఇంట్లో 8తులాల వెండి పట్టీలు, 13వ బ్లాక్‌లో బొట్ల సంపత్‌కు చెందిన ద్విచక్ర వాహనం దొంగిలించినట్లు తెలిపారు. వీరందరూ తమ కుటుంబాలతో కలిసి ఊరికి వెళ్లారని, శుక్రవారం తెల్లవారుజామున క్వార్టర్ల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు వచ్చి దొంగతనం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బ్లాక్ నెం.31లో తాళం వేసి ఉన్న 426, 428, 430 క్వార్టర్లలో తాళాలు పగుల గొట్టారని, ఆయా క్వార్టర్లలో ఎవరూ నివాసముండడం లేదన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 16 : మండలంలోని కందుగుల గ్రామ శివారులో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన గండె శ్రీ తిరుపతి అనే వ్యక్తి గ్రామంలో తక్కువ ధరకు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు బియ్యం సంచులతో ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి పక్కగా పారిపోతుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆ వ్యక్తిని బియ్యం అమ్మిన మిల్లుకు తీసుకొని వెళ్లి విచారించగా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యం విలువ రూ. 1,0800 ఉందని తెలిపారు. ఈ మేరకు సీఐ తిరుమల్ కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ఆలయాల్లో ఉద్యాపన, కుంకుమ పూజలు



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి, ఆగస్టు 16: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండవ శుక్రవారం భక్తజన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడ తోడు కావడం వల్ల అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. అలాగే గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో ఉపా వాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మణిదీప వర్ణణ పూజ, లలిత, మహాలక్ష్మి అష్టోత్తరం, పంచామృతాభిషేకం, హారతి పూజలు చేసి నివేదన సమర్పించారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళల కుంకుమ పూజలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, ఆగస్టు 16: నెల వారి మరమ్మతుల దృష్ట్యా పలు సబ్‌స్టేషన్స్, 11కెవి ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడిఈ సాయినేని నరేందర్ ఒకప్రకటనలో తెలిపారు. 33/11 కెవి సబ్‌స్టేషన్స్ వావిలాలపల్లి, బ్యాంక్‌కాలనీ, అంబేద్కర్‌నగర్, వాటర్‌వర్క్స్ (హౌజింగ్ బోర్డుకాలనీ), 11 కెవి ఫీడర్స్ వావిలాలపల్లి, జ్యోతినగర్, క్రిస్టియన్ కాలనీ, ఐబీ ఫీడర్, సివిల్ హాస్పిటల్, వెంకటేశ్వర ఫీడర్, బ్యాంక్ కాలనీ, మెహర్‌నగర్, వరలక్ష్మీనగర్, కోర్టు రోడ్, జగిత్యాలరోడ్, సుభాష్‌నగర్, మంచిర్యాల ఎక్స్‌రోడ్, కిసాన్‌నగర్, గాంధి ఫీడర్, తీగలగుట్టపల్లి, కాపువాడ, హౌజింగ్‌బోర్డు, వెంకటసాయి, కమాన్ ఫీడర్, ఎల్లమ్మఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలనికోరారు.

● ఎస్ఆర్ఆర్ కళాశాల 33/11 కెవి పరిధిలోని సంతోష్‌నగర్, భాగ్యనగర్, శక్తిటెంపుల్, విద్యానగర్, ఆదిత్యనగర్, లాబాజి సూపర్‌మార్కెట్ ఏరియా, జ్యోతినగర్, విజయదుర్గకాలని, న్యూ లేబర్ అడ్డా ఏరియాల్లో శనివారం ఉదయం 9.30 నుండి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ ఎం సుదీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటలతో శారీరక, మానసిక దృఢత్వం



ట్రోఫీ అందజేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 16: ఆటలతో శారీరక, మానసికంగా దృఢత్వం లభిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శాతవాహన యునివర్సిటీ మైదానంలో శాతవాహన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ టోర్నమెంట్ లో రాజేశం, శ్యామ్ సుందర్ టీం గెలుపొందగా, నర్సింగం టీం రన్నర్స్‌గా నిలిచారు. నరేందర్ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ పోచయ్య పటేల్, పెరుక రాజేందర్, హరీష్, ఫనీ, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అస్థపురం రమేష్, అస్థపురం తిరుమల, మల్లికార్జున్, భరత్ పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచంపై గీతకార్మికులకు శిక్షణ

కరీంనగర్ క్రైం/కరీంనగర్ రూరల్ ఆగస్టు 16: గీతకార్మికులు వృత్తిలో భాగంగా తాటి, ఈత చెట్లు ఎక్కుతున్న సందర్భంలో మోకు జారి ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ మోకు) తీసుకువిచ్చింది. ఈ సేఫ్టీమోకు ఏ విధంగా ఉపయోగించాలనే విధానంపై కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లిలో శుక్రవారం స్థానిక గీత కార్మికులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచంపై గీతకార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10 మందికి శిక్షణ ఇచ్చామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ విజయభాస్కర్, ఎక్సైజ్ సిబ్బంది, ఆరెపల్లి గౌడసంఘం అధ్యక్షులు గౌరయ్య, గీతకార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కరీంనగర్ రూరల్, ఆగస్టు16: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ శుక్రవారం భూమి పూజ చేశారు. మండలంలోని గోపాల్‌పూర్, ఇరుకుల్ల, ఎలబోతారం, జూబ్లీనగర్, ఫకీర్‌పేటలో ఓపెన్ జీమ్‌ల నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కరీంనగర్ మండల శాఖ అధ్యక్షుడు కాం రెడ్డి రాంరెడ్డి, మండల శాఖ అధ్యక్షురాలు మోరపాక మంజుల, ఉపాధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, బెజ్జంకి శేఖర్, మండల కార్యదర్శి సాయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు జిల్లా యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 16: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా యూత్ బాలబాలకల బాస్కెటబాల్ జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జగిత్యాల రోడ్‌లోగల ఎస్‌పీడీసీఎల్ స్పోర్ట్స్ మైదానంలో గల బాస్కెట్‌బాల్ కోర్టులో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభచాటే క్రీడాకారులను ఈనెల 26,27 తేదీలలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. 2008 జనవరి 1 తరువాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు పాఠశాల లేదా కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ

రాష్ట్ర కన్వీనర్‌గా కోడూరు పరుశురాం గౌడ్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 16: సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా కోడూరు పరుశురాం గౌడ్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లా గౌడ జాతి బిడ్డ కొత్తపెళ్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన కోడూరు పరుశురాం గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టనుంది. ఈ సందర్భంగా కోడూరు పరుశురాంగౌడ్ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ నియమకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముర్రు పాలు బిడ్డ ఆరోగ్యానికి రక్ష

● జడ్పీ సీఈవో శ్రీనివాస్

గంగాధర, ఆగస్టు 16: బిడ్డ ఆరోగ్యానికి తల్లిముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని జడ్పీ సీఈవో శ్రీనివాస్ అన్నారు. గురువారం గట్టుబూత్కూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ తల్లి ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి శిశువు సురక్షితంగా ఉంటారని అన్నారు. పిల్లలకు తల్లి పాలు తేలికగా జీర్ణమవుతాయని తప్పకుండా తల్లి పాలనే తాగించాలన్నారు. తల్లి పాలు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందజేస్తాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తు సౌకర్యాలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, వైద్యసిబ్బంది ఉన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

హుజూరాబాద్, ఆగస్టు 16: హుజూరాబాద్ పట్టణంలోని పోస్టాఫీస్‌లో బ్రహ్మకుమారిస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తుగా రాఖీ పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సభ్యులు మాట్లాడుతూ రాఖీ యొక్క విశిష్టతను తెలియజేస్తూ అక్కా చెల్లెలు, అన్నదమ్ముల బంధం గురించి వివరించారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక దంపతులకు ముందస్తు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు కల్పన, శ్రీవాణి, జ్యోతి, రాజయ్య, ఈశ్వరయ్య, నిరంజన్, పోస్టు మాస్టర్ యమహేందర్, రాజు, వేణు, శ్రీనివాస్, సందీప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని విభజించకండి

● మంత్రి, ఎమ్మెల్యేలకు గుండ్లపల్లి గ్రామస్థుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

గన్నేరువరం, ఆగస్టు 16: మండలంలోని గుండ్లపల్లి గ్రామపంచాయితీ నుంచి గుండ్లపల్లి స్టేజి ఎక్స్ రోడ్‌ను విభజించవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలను గ్రామస్థులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కొత్తగా ఏర్పడు గ్రామపంచాయతీల జాబితాలో మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్ నూతన గ్రామపంచాయితీ ఏర్పాటు అనే అంశం తెరపైకి రావడంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్థుల అభిప్రాయాల మేరకు జాబితా నుంచి గుండ్లపల్లి ఎక్స్ రోడ్‌ను తొలగించాలని మంత్రిని, ఎమ్మెల్యేని కోరినట్లు గ్రామస్థులు తెలిపారు. నాయకులు బేతెల్లి రాజేందర్‌రెడ్డి, కాలువ పెద్ద కొమురయ్య, వంగల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



హుజూరాబాద్‌లో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మానకొండూర్, గన్నేరువరంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్/హుజూరాబాద్/చొప్పదండి/శంకరపట్నం/మానకొండూర్/తిమ్మాపూర్/గన్నేరువరం ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్, హుజూరాబాద్, చొప్పదండి, శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, గన్నేరువరంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళల్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

కరీంనగర్ అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో డిస్కో డాన్సులు చేసుకోవాలని చేసిన వ్యాఖ్యలపై సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణ ఆడపడుచులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ క్షమాపణలు చెప్పకుంటే కేటీఆర్‌ను తెలంగాణలో తిరగనివ్వబోమన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: కేటీఆర్ మహిళలకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ బండి మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: తెలంగాణ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షురాలు మంత్రి లత డిమాండ్ చేశారు. గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహిళలు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో వరలక్ష్మి వ్రత పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 16: నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో శుక్రవారం శ్రావణ శుక్రవార, ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి వేడుకల విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సిద్దార్థలో..

మంకమ్మతోట సిద్దార్థ విద్యాసంస్థలో వేడుకలను చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. వ్రతాలు, పూజల అనంతరం చైర్మన్ సతీమణి స్వప్న విద్యార్థుల మాతృమూర్తులకు వాయినాలు పంచారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) శుక్రవారం శ్రావణ శుద్ధ ఏకాదశి, వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి, జ్యోతిష వాస్తు పండితుడు నమిలకొండ రమణాచార్యస్వామి నేతృత్వంలో వేడుకలు నిర్వహించారు.

ఆర్యవైశ్యుల పోస్టుకార్డు ఉద్యమం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చవద్దని కోరుతూ ఆర్యవైశ్యులు పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని, మార్పు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులను పంపించారు. శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డులను సీఎంకు పంపించారు. పొట్టి శ్రీరాములు వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల రామేశం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్నకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొముర వెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, రాజకీయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీధర్ పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు సన్మానం

సుభాష్‌నగర్, ఆగస్టు 16: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని టీఎన్‌జీవో నాయకులు సన్మానించారు. శుక్రవారం శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో ఆయనను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్‌జీవో నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కేంద్ర సంఘం నాయకుడు నరసింహస్వామి, నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి: మేయర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: నాలుగున్నర సంవత్సరాల్లో ప్రజలపై పన్నుల భారం మోపకుండా ప్రణాళికాబద్ధంగా నగరాన్ని అభివృద్ధి చేశామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మరో ఆరు నెలల్లో అన్ని కాలనీల్లో అసంపూర్తి పనులతోపాటు సమస్యలన్నింటినీ పరిష్కరించడమే ధ్యేయంగా కృషిచేస్తామని చెప్పారు. శుక్రవారం 12వ డివిజనలో కార్పొరేటర్ తోట రాములుతో కలిసి పర్యటించి రూ.20.20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ వేంకటేశ్వర కాలనీ వంటి శివారుకాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. విలీన గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం: సీఐ

గణేష్‌నగర్, ఆగస్టు 16: గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలిద్దామని వన్‌టౌన్ సీఐ సరిలాల్ పిలునిచ్చారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలించాలని చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతను చిత్తు చేస్తున్న డ్రగ్స్‌ను నిర్మూలిద్దమన్నారు. దేశం భవిష్యత్తును నిలబెట్టగల శక్తి సామర్థ్యాలు యువత సొంతమన్నారు. యువతను మత్తులో ముంచే డ్రగ్స్ గంజాయిని నిర్మూలించడానికి ప్రజాస్వామిక వాదులు, మేధావులు, యువత ముందుకు రావాలన్నారు. డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతి, రాజునాయక్, రవీందర్, గంగాధర్, సురేష్ రైనా, రహీం పాల్గొన్నారు.

రా రైస్ మిల్లర్స్ జిల్లా అధ్యక్షుడిగా తణుకు సురేశ్



తనుకు సురేశ్‌ను అభినందిస్తున్న రైస్ మిల్లర్లు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తణుకు సురేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తణుకు సురేశ్, గౌరవ అధ్యక్షుడిగా తాండ్ర అశోక్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వంగా జనార్దన్, కోశాధికారిగా బండారి రమేశ్, ఉపాధ్యక్షులుగా సుధగోని తిరుపతిగౌడ్, మొగ్గశాల సంతోష్‌రెడ్డి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా రావి రవీందర్, గాజుల శ్రీనివాస్‌గౌడ్, నార్ల రాజేందర్, ఆకుల శశివర్ధన్, ఇప్పనపల్లి వెంకటనారాయణ, నార్ల వెంకటేశ్వర్లు, తొవిటి విజయ్‌కుమార్, ఆడెపు రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో రా రైస్ మిల్లర్ల యజమానులు మహేశ్, వేణు, మాధవరావు, మల్లారెడ్డి, గోమాత శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మార్కండేయ, నారాయణ పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టును వెంటనే మరమ్మతు చేయాలి



కల్వల ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

శంకరపట్నం, ఆగస్టు 16: మండలంలోని కల్వల ప్రాజెక్టుకు వెంటనే మరమ్మతు చేపట్టి రైతులను మత్స్యకారులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వల ప్రాజెక్టుకు గండి పడిన ప్రదేశాన్ని శుక్రవారం స్థానిక శంకరపట్నం మండల బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించే కల్వల ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు శంకరపట్నం, వీణవంక మండలాల్లోని 2వేల ఎకరాలకు పైగా పంటలకు సాగునీరు అందిస్తుందన్నారు. హుస్నాబాద్, సైదాపూర్, శంకరపట్నం మండలాల నుంచి 422 కిలోమీటర్ల మేర క్యాచ్‌మెంట్ ఏరియాను ఈ ప్రాజెక్టు కలిగి ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. మొత్తం ప్రాజెక్టు పూడిక నిండిపోయిందని, ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడిందని, ఫలితంగా వందల ఎకరాలు ముంపునకు గురికావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో రామిడి ఆదిరెడ్డి, మాడ వెంకటరెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ గౌతమ్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, జెల్ల సుధాకర్, దండు కొంరయ్య, తిరుపతిరెడ్డి, మల్లేష్, అనిల్, సదానందం, కుమార్, గోవిందరెడ్డి, వీరస్వామి, సమ్మయ్య, కుమార్, వెంకటేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలోని బస్టాండు కూడలిలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి బీజేపీ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి నాయకులు రామిడి ఆదిరెడ్డి,మాడ వెంకటరెడ్డి,ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ గౌతమ్‌రెడ్డి ఉన్నారు.

ప్రొఫెసర్ కోదండరాం నియామకంపై హర్షం

హుజూరాబాద్, ఆగస్టు 16: ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా నియామకం చేయడం హర్షనీయమని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఉద్యమకారులను గుర్తించకుండా, గౌరవించకుండా అణిచివేత ధోరణి అవలంబించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ, గౌరవిస్తూ సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన, ఉచిత విద్యను అందించేందుకు కోదండరామ్‌ను మంత్రివర్గంలోకి తీసుకొని విద్యాశాఖను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సైదాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

సైదాపూర్, ఆగస్టు 16: రూ. 2లక్షల రైతు రుణమాఫీ చేయడం పట్ల సైదాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ బాణాసంచా కాల్చారు. అలాగే మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు కిష్టయ్య, రవీందర్, మల్లయ్య, రాజు, యాదగిరి, కిషన్‌నాయక్, లక్ష్మణ్, ఇంద్రసేన, విద్యాసాగర్‌రెడ్డి, రాజకుమార్, కొంరయ్య, స్వామి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్ నిర్మాణం జరిగేనా?



ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డు

చొప్పదండి, ఆగస్టు 16: మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట మీదుగా మల్యాల, జగిత్యాల వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. పలు మండలాలతో పాటు అనేక గ్రామాలకు వారధిగా నిలుస్తున్న ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఆర్నకొండ వద్ద రాయపట్నం రహదారి నుంచి ప్రారంభమయ్యే రోడ్డు రాగంపేట, రేవెల్లి,పెద్దకుర్మపల్లి, రామడుగు మండలం గోపాలరావుపేట నుంచి గంగాధర మండలం బూరుగుపల్లి, మల్యాల మీదుగా జగిత్యాల వరకు వెళ్తుంది.పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంట ప్రతి నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ రోడ్డు చాలా చోట్ల దెబ్బతినగా కనీసం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● జాడ లేని మరమ్మతులు

అర్నకొండ నుంచి మల్యాల వరకు రోడ్డు మరమ్మతు పనుల కోసం ఏడాది క్రితం నిధులు మంజూరు అయ్యాయి. రోడ్డును మూడు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట, బూరుగుపల్లి వరకు అక్కడి నుంచి మల్యాల వరకు రోడ్డును మూడు బిట్లుగా విభజించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి ఇప్పటి వరకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు దెబ్బతినగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అవాకులు, చవాకులు మానుకోవాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 16: కేంద్ర మంత్రి బండి సంజయ్ అసలు విదేశాంగ విధానం అంటే ఏంటో తెలుసుకొని మాట్లాడాలని, గాంధీ కుటుంబంపై అవాకులు, చవాకులు పేలటం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండి సంజయ్ రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశం కోసం తమ ప్రాణాలనే బలిదానం చేసిన గాంధీ కుటుంబంపై అవాకులు, చవాకులు పేల్చడం మానుకోవాలని హెచ్చరించారు. రాహుల్ గాంధీకి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలన్నారు.

బాధ్యులపై క్రిమినల్ కేసు పెట్టాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులకు సంబంధించిన 152 మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) పోయిందంటూ పోలీస్ స్టేషన్‌లో కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయడం వెనుక అవినీతి బాగోతం దాగి ఉందని, ఎంబీ పోవడానికి కారకులైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయించాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్ ఒక ప్రకటనలో కమిషనర్‌ను కోరారు. ఒకవేళ ఎంబీ పోతే మున్సిపల్ కమిషనర్‌కు, ఏఈకి ఫిర్యాదు చేయాలి కానీ నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వెనుక రహస్యమేమిటో కాంట్రాక్టర్ బహిర్గతంచేయాలని డిమాండ్ చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 16: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీలో ట్రైని డాక్టర్‌ను హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిలో ప్రభుత్వ డాక్టర్లు ఓపీ సేవలను నిలిపివేసి నిరసన తెలిపారు. వారి నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టరుకు న్యాయం జరిగేంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమిస్తామన్నారు.

కరీంనగర్ టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ కరీంనగర్ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గాంధీరోడ్‌లోని వైశ్యభవన్‌లో జరిగిన కొవ్వొత్తులతో చేపట్టిన నిరసన కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్నకృష్ణ, పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్, జిల్లా ప్రధానకార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి శ్రీనివాస్, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, రాజకీయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీధర్, అభ్యుదయ సంఘాల అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతపై కాంగ్రెస్ విఫలం

భగత్‌నగర్, ఆగస్టు 16: ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో అన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అనేక గ్రామాల్లో ప్రజలు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నారన్నారు. సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏసీపీకి సన్మానం

సుభాష్‌నగర్, ఆగస్టు 16: శ్రీనగర్ ఉమెన్స్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గడప నిరంజనీ దేవి ఆధ్వర్యంలో శుక్రవారం ఏసీపీ మాధవిని ఘనంగా సన్మానించారు. ఆగస్టు 15 సందర్భంగా మెడల్ అందుకున్నందుకుగాను ఏసీపీని సన్మానించారు. ప్రెసిడెంట్ నిరంజన్‌దేవి, సెక్రటరీ కంటే గంగాభవాని, వైస్ ప్రెసిడెంట్ కడారి విజయ, ఏ పద్మావతి, సంద స్వప్న, జోన్‌చైర్మన్ గడప కోటేష్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టణ బంద్ ప్రశాంతం

చొప్పదండి, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాకాండలకు నిరసనగా చొప్పదండి పట్టణంలో హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు శుక్రవారం బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపారులు తమ దుకాణాలను మూసివేశారు. ఐక్య సంఘం అధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పడకంటి కృష్ణ, హిందూ సంఘాల ఐక్య వేదిక సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, హిందూ ఐక్యవేదిక పిలుపు మేరకు శుక్రవారం హుజూరాబాద్ పట్టణం బంద్ విజయవంతమైంది. పట్టణంలోని వ్యాపార స్థులు, పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించారు.

అక్సా మజీద్ కమిటీ ఎన్నిక

చొప్పదండి, ఆగస్టు.16: చొప్పదండిలోని అక్సా మజీద్ కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ముసదిక్ హఫీస్ సహాబ్, అధ్యక్షుడుగా ఎండీ షాదుల్లా, ఉపాధ్యక్షులుగా ఎండీ అస్గర్‌అలీ, హైమత్ హుస్సేన్, హోలీ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ముస్తఫా, కార్యదర్శిగా ఎండీ శంశొద్దీన్, ఫయాజ్, కోశాధికారిగా ఎండీ నాసర్ ఎన్నికయ్యారు.

ప్రధాన రహదారిపై విరిగిపడిన వృక్షం

గంగాధర, ఆగస్టు 16: మండల కేంద్రంలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షానికి ప్రధాన రహదారిపై వృక్షం విరిగిపడింది. ప్రధాన రోడ్డుకు అడ్డంగా పడగా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. కరీంనగర్, నిజామాబాద్ ప్రధాన రహదారి కావడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

సైబర్ నేరాలపై అవగాహన

రామడుగు, ఆగస్టు 16: మండలంలోని గోపాల్‌రావుపేటలో ప్రజలకు శుక్రవారం సైబర్ నేరాలపై ఎస్ఐ సురేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నియామకం

గన్నేరువరం, ఆగస్టు 16: ఈ నెల 18న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలకు ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నాగుల కనుకయ్యగౌడ్ నియామకం అయ్యారు. గౌడ కులస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నేలకొరిగిన మొక్కజొన్న

గన్నేరువరం, ఆగస్టు 16: మండలంలో శుక్రవారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పారువెల్ల గ్రామంలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని పిట్టల రాములు కోరాడు.

● సంక్షిప్త సమాచారం..

సుభాష్‌నగర్: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద క్రీడాకారుడు ఎం వినయ్‌కి రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ రఘురామన్ నగదును అందజేశారు.

● **ఇల్లందకుంట/హుజూరాబాద్/రామడుగు:** ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో, హుజూరాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో, రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలోని అల్ఫోర్స్ పాఠశాలలో వరలక్ష్మి వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.